# రామూలాలీ! రైతన్నాలాలీ!!

జాము రేత్రికి పైబడుంటింది.

మా పిల్లలకోడి యింకా మిద్దిమిందికి రాలా. కన్ను పొద్సుకుణ్ణా కంటి మింద రెప్పట్టా పడమంటే పడనంటా ఉండాది. అట్ట పొల్తా కొంచేపు... యిట్ట పొల్తా కొంచేపు కూరాడ్తా పొరాడ్తా ఉంటే పడక కూరాకు మాద్రైపొయ్యింది. దిండు యాళ్లసందన కొంచేపు కాళ్లసందన కొంచేపు మార్సి మార్సి నలిగే కుందికి అది కుళ కుళ వళ వళ అయి పొయ్యింది. గోడమింద గెడారం యాలాడ్తా ఉండాది. అది ఎవురేడబోతే నాకేం అన్నెట్టుగా టిక్ టిక్ మని తన పనితాను చేసుకోని పోతా వుండాది– గుడ్డెద్దు చేనిలో పణ్ణెట్టుగా!

'' కొంతమంది ఉంటారు. అట్ట పొణుకుంటారో లేదో? కండ్లు మూతలు బడిపోతాయి. చూస్తా చూస్తా ఉండంగానే గుర్ గుర్ మని గురకపెట్తా ఉంటారు. అట్టాంటోళ్లను చూస్తా ఉంటే ఎంత ఆనందంగా ఉంటిందో? వాళ్ల అదురుష్టమే అదురుష్టం! గురుడట్టా వాల్తానే గుట్టెక్కి పొయ్యేదంటే మాట్లా? కడుపార అంత తిని కంటారా నిద్దర పొయ్యే దానిగ్గూడా యిచ్చి పెట్టుకోనుండాల!'' అని మా బాశాలి అడపా దడపా సొణుక్కుంటా ఉంటే–

''ఒంటికి సెగ తగలతా వుంటే గదే కంటికి నిద్దర పట్టేదానికి? పొద్దు గూకూలూ 'పొద్దెట్టా పొయ్యేది రామారీ!... అది పొద్దెట్ట వొచ్చేది రామారీ!' అని కాళ్లాడించుకుంటా కూసుంటావు. మల్లా అల్సి పుల్సి అరపడి అయినవాళ్ల కతలెత్తి అడ్డంగా పెట్టుకోని మాట్టాడ్తావు. ఎట్నే నీతో?'' అని అడిగేయాలని ఎన్నోసార్లు ముంపి ముంపి మణుసును చంపుకుణ్ణా. అడిగినామే అనుకో. ఇంక ఆ పూట కొంప మూడారుదోవలే!

ఈ పొద్దు నాగ్గూడా నిద్దర పట్టలేదంటా ఉండానంటే నా వొంటికి గూడా సెగ తగల్లేదనే కదా అర్తం?

నా వొంటికి సెగ తగల్లేదా?

రామ! రామ! అయ్యోరామ!! మా బాశాలి అన్నెట్టుగా కంటార నిద్దర పోవాలన్నా యిచ్చి పెట్టుకోనుండాల. ఒంటికి సెగ దగలకుండా కాలిమింద కాలేసి కూసోని కమ్మగా మూడు పూటలంత తినేదానిగ్గూడా యిచ్చి పెట్టుకోనుండాల. అయితే అట్టామాదిర కూసోని తింటా ఉండే వాళ్లంతా ఎవురికిచ్చి పెట్నారో? ఎంత యిచ్చి పెట్నారో? ఎప్పుడిచ్చి పెట్నారో? చూసొచ్చిన యదవ ఎవుడైనా వుంటే రమ్మనండి నా ముందుకు చూద్దాం? అయితే కుర్దుగా చూసొచ్చిన వాళ్ల మాదిర కూసేవాళ్లు మాత్రం యింటికి యిద్దురు ముగ్గురన్నా ఉంటారు. అప్పుడెప్పుడో యిచ్చి పెట్టింది యిప్పుడు కూసోని తింటా ఉండారంట. నిజిమే అనుకుందాం. అయితే యింకెప్పుడో తినబొయ్యేదానికి యిప్పుడిచ్చి పెట్టాల గదా? యాడా? ఏలు తెగిందంటే గిచ్చి అంత సున్నం పెట్టమన్నా పెట్రే నాయాండ్లు!

ఇంక కుక్కల మాదిర్తో బతుకులన్నీ కనా గ్స్టంగా బతకతా కడతేరి పోవాల్సిందేగదా? అయినా నాదేముండాది లే. అయిన కాడికి మద్దేణం . తెల్లంగా ఉండే కాకితాల్ను నల్లంగా చేసుకుంటా ఈ యిలాకాలో నాకు మించిన మొనగాడే లేదని యిర్ర యాగతా కాలం నెట్టేస్తా. కానీ పాపం! వాడా వెంకట రెడ్డి?

వెంకట రెడ్డి అంటే ఎటుమంటోడు? అటుమంటోడీ కాలాన పుట్టాల్సిన వాడే గాదు. వాడొక సత్తికాలం మణిసి!

అయినా చదువుకునేటప్పుడు నన్ను ఎగటాయించి తిరిగినోడు కూడా వెంకటరెడ్డే!

చిన్నప్పుడు మా ఊళ్లో పిలకాయిలు శెనిగ్గింజలు తెచ్చి పెట్టినోళ్లుండారు. బెల్లం తెచ్చిచ్చినోళ్లుండారు. రొండు సెక్రాల బండిమింద కూసోబెట్టుకోని రోడ్డుమింద ఈ వారికీ ఆ వారికీ యీడ్సినోళ్లుండారు. ఎందుకంటే అప్పొవుపిళ్ల అయ్యోరు చేతికిచ్చిన బెత్తం ఒక ఎత్తయితే మన చేతి చెంప దెబ్బలు యింకొక ఎత్తు!

అయితే వెంకటరెడ్డి మాత్రం 'నన్ను నువ్వు చెంపదెబ్బలు ఎయ్‌లేవు. నా దగ్గిరేమీ తీసుకోలేవు.' అని అనకుండానే అనిన మొగలాయి!

అన్నిటికంటే యిచ్చిత్రం ఏమిటంటే?– ఏమి కావాలంటే అది తెచ్చిచ్చినోళ్లంతా ఎట్టపాయ్‌నారో అడియాళం లేకుండాబోతే ఆ పొద్దుట్నుంచి వెంకటరెడ్డి ఒక్కడే ఒక్కడుపులో పుట్నోడి మాదిర అతుక్కోని పొయ్‌నాడు. వాడికి అన్నలు లేరు. నాకు తమ్ముళ్లు లేరు. వాడికి నేను అన్న. నాకు వాడు తమ్ముడు. ఈ జలమానికి మాముచ్చట యిట్టా తీర్సుకుంటా ఉండాం!

''అన్నా! బండ్ల యీదిలో కూసోని కడుపులో సల్ల కదలకుండా బండ్ల కెత్తాలని రాస్తా ఉండావు. బాగానే ఉండాది. అయితే ఆడకూసుంటే ఏమి తెలిస్తింది? రా! వొచ్చి

మా బతుకులు సూడు. ఆ బతుకులు పడ్తా వుండే పలుబాట్లు సూడు'' అని పిలిస్తే పోతి. గుంటకట్టమింద బస్సు దిగితి. ఆడదిగితే మణుసు గెంటాణపల్లికి మణిసి మిద్దాళ్లోకిగా ఉండె ఒకప్పుడు. ఇప్పుడు కత తిరగబడి పాయ. 'ఈణ్ణే నా తాతల తరాన్నుండి మా అయ్య తరందాకా ఓహో! అని ఎలగబెట్టింది?' అని అనుకుంటే కడుపు అట్నే తరక్కపోతింది. అందుకనే దిగీ దిగంగానే గెంటాణ పల్లికే ఎలబార్నా!

ఊళ్లోకి పోతి. వాడి యింటిముందర నిలబడుకుంటి. ఆ యిల్లు ఎట్టుండె? తీరిగ్గా కూసోని సింగారించుకుణ్ణె నిండు ముత్తయిదు మాదిర్తో ఉండె. ఇప్పుడు పాడుగొట్టుకోని పాయ్యుండాది. ఎందుకిట్టయిందే? దీన్ని చూపించే దానికేనా వాడు రమ్మనింది. అని ఆలోచించుకుంటా దిక్కులు చూస్తా నిలబడుకోనుండా!

''ఎంగట్రెడ్డా అబ్బోడా! వోడి కాపరం యిప్పుడు బాయికాణ్ణే. సెరుకు గాని గాడ్తా ఉండేటట్టుగా ఉండాది''

ఆ దోవన పోతా పోతా వుండి అడివోళ్ల కర్రెన్న అనె.

ఎతుక్కుంటా బాయికాడికి పోతి.

కర్రెన్న చెప్పిన మాట కరట్టే! చెరుకు గానిగ ఆడ్తా ఉండారు.

చెరుకుగానిగ ఆడేదంటే కొంచిం ఎచ్చ్యాతక్కవగా నెలదినాల పని. ఆ నెల దినాలు గాని గెత్తిన కయ్యిలోనే కాపరం. మూడు కడవల పాలైతే ఒక వంట. ఒక కాడి తిరిగితే ఒక వంట పాలు. ఒక వంట దిగితే యిరవై ముద్దల బెల్లం. ఒక వంట దిగాలంటే నాలుగైదు గెంటలు. ఒక దినానికి అయిదారు వంటలు దిగితే అదొక బెమ్మాండం. ఎద్దల గట్టి గానిగ తిప్పతా ఉండ్రి.

ఇప్పుడా! కరెంటు గానిగలు వచ్చేసినాయి!

ఈ కరెంటు రానన్నా వచ్చింది. 'రామన్నరామో!' అని మోటలు తోలే పని తప్పాయ. గానిగలు ఎద్దలగట్టి తిప్పాల్సిన పని లేకపాయ. రైతులు శానా సుకపడి పాయ్నారబ్బా!'' అని అనుకుంటా అట్టా యిట్టా చూసి అక్కడుండే మంచం మింద కూసుంటి.

''ఎప్పుడన్నా రావడం?'' అని అడగతా వెంకటరెడ్డి వచ్చె. అసలే మణిసి వాడంతంత మాత్రం. చెరుకు గానిగ అంటే శానా పీకులాట యవారం. యాడిదాడ పీక్కోని పాయ్యుండాడు. వాణ్ణి ఎగాదిగా చూస్తా ఉంటే–

''రైతు బతుకులో ఏం సుకం లేదన్నా!'' అంటా నచ్చి పక్కన కూసుండె.

''అన్నా! ఉద్దోగం చేసేటోడు ఒకడు చేస్తే యింట్లో వాళ్లందురూ కూసోని తింటారు. మాపాడా? అట్టగాక పాయనే! అప్పుడు పుట్టిన బిడ్డగ్గూడా యాడ పనుండాది. అట్ట పీకులాడ్తా ఉంటే గూడా నాలుగేళ్లు నోట్లోకి పాయ్యేది గెగనమై పోతా ఉండాది.''

చెవుల్ను వాడికిచ్చేస్తే చూపులు వాటి యిష్టపకారం తిరగతా ఉండాయి.

వాడి పెండ్లాం మొగరాయుడి మాదిర్తో వామి మిందికెక్కింది. వాడికొకడే కొడుకు. వాడు ఊరు చూ(డా అంటే ఉత్తరం చూస్తాననే బిడ్డ. ఆ పొద్దు ఎట్నో వొళ్లు వంగినట్టుండాది. కసువు కట్టలు వామి మిందికి యిసిరిసిరేస్తా ఉండాడు. వాటిని అలాగ్గా పట్టుకోని వాళ్లమ్మ వామి ఏస్తా ఉండాది. కోడాలు సెరుకుపిప్పిని ఎండేస్తా ఉండాది. అయిదారు మంది కూలోళ్లు. ఒకడు గానిక్కి చెరుకు అందిస్తా ఉండాడు. ఇంకొకడు చెరుకు పిప్పిని చెరుకాకును కలేసి పొయ్యిలోకి దురకతా పొయ్యిమంటేసి పాలు కాస్తా ఉండాడు. అట్టా తలా ఒక పనిలో తలమునకలుగా ఉండారు.

వాడిమాట నిజిమే! పుట్టిన బిడ్డగ్గూడా ఆడ పనుండాది.

అంతలోనే చిలకల కొండమింద డమడమామని ఉరిమె!

చిలకల కొండ మింద ఉరిమితే చినుకు నేలరాలాల్సిందే!!

''ఇద్దో యిట్టన్నా బతుకు. ఈ పొద్దుటిదాకా చినుకు నేలరాల్లేదే? ఎట్టబ్బా? అని యాడస్తా ఉంటిమి. ఇప్పుడురాల్తే ఎట్టబ్బా? అని యాడవాల. బెల్లం తడ్సిపోతింది. చెరుకు పిప్పి తడ్సిపోతింది. ఎండేసిన కసువు తడ్సిపోతింది. పోనీ! వొచ్చేదైనా ఒక వాటంగా వొచ్చి ఏడిస్తే పరవాలే. లేదే? పైమొబ్బు సినుకులు. పల పల రాల్తాయి. పన్చేటు సేసేసి పోతాయి.''

''ఈ కాలాన అందురి బతుకులు ఆడికే ఏడ్సినాయిలేరా? కలబెట్తే చాలు. ఒకొక్కడు గంపల్తో ఎత్తెత్తి పోస్తాడు.''

''అదేందన్నా అట్టంటావే? ఇంత అద్దోనం బతుకు యింగొగిటి యింగొగిటి ఉండదనుకో. ఎవుడుండాడన్నా వాడికి దాపు? అదే వొక ఆపీసులోనో ప్యాక్టరీలోనో అయితే అయినకాడికి మద్దేణం. అంతా గి(రగేసుకోని గెంటల పకారం చేస్తారు. ఈడ అట్టవితిందా? ఆ బతుకు యీడికి అమిరితిందా? పొద్దుపుట్టేదీ తెల్దు. పొయ్యేది తెల్దు. పొద్దుగూకులూ యిద్దో యిట్టా పోరకలాడ్తే గూడా యీడికి అందదు. ఆడికి సాల్దు. ఏం బతుకులన్నా ఈ బతుకులు? అమ్ముకుందామంటే అడివి. కొనబోతే కొరివి. ఒక ముక్కు నొచ్చిందని లేదు. మూతి నొచ్చిందని లేదు. జరం తగిలిందని లేదు. తలకాయి నొచ్చిందని లేదు. అదే వొక ఉద్దోగిని తీసుకో. పేనా మూసిపెట్టేసి లేసి సక్కాబోతాడు. వాణ్ణి అడిగే నీ కొడుకెవుడైనా ఉండాడా? అడిగితే 'లీవు రాసుకోపో' అంటాడు. ఈడ అట్టామాదిర్తో కుదిరితిందా? వొంచిన నడుము ఎత్తకుండా యిట్టా బాదలు పడ్తావుంటే మమ్మల తల్సుకుండే నాదుడెవుడుండాడు? మాపటేళ. కన్ను పొడ్సుకుణ్ణా కానరాని సీగిటి. ఆ సీగిట్లో తిరగలాడ్తా ఉంటాం. ఏ పురుగో బూసో కాటేస్తింది. మందో మాకో యాడుండాది? ఎవుడిస్తాడు? సస్తాం. పట్టించుకుండే వాడెవుడు? సావుకు దుడ్డిస్తా ఉండారా? సంసారం గడ్సే దానికి దుడ్డిస్తా ఉండారా? మా సెగితి కాడికి ఉణ్ణంత కాలం పోరకలాడ్తాం. ఉడిగిపోతే మూలపడ్తాం. అయ్యో పాపం! అని పించన్లేమన్నా మంజూరు చేస్తా ఉండారా? లేదంటే రైతు లేందే రాజ్జిం లేదంటారు. రైతులే దేశానికి ఎన్నెమిక లంటారు. ఈ మాటలు యినీ యినీ సెవ్వులు తూట్లు పడిపొయ్‌నాయి. అట్టగాదులే? కుర్సీ మింద కూసోని

తెల్లకాగితాల్ను నల్లంగా చేసేవాడు పేనా మూసేసి బయిటికి నడ్సినట్టు... ఫ్యాక్టరీలో పన్జేసే వాడు శాతుండే స్పానర్ యిసిరి పారేసి యీాదల మింద పణ్ణెట్టు– మేమంతా యీ మట్టిమింద మమకారాన్ని చంపుకోవాల. మడకల్ను యిసిరి మూల పారేయాల. కట్ట గట్టినట్టు కట్టుగా బయిటికి నడవాల!''

''ఒరే! నీ మొకం బయిశారా! మట్టి పిసుక్కోని బతికే వాడిగ్గూడా యింత బెట్టు... యింత నెట్టు అయితే ఎట్టరా! వద్దునాయినా వద్దు. అంతంత పెద్ద ఆలోచన్లు వొంటికి సెబ్బర!'' అన్నెట్టుగా పల పల పది పైమొబ్బు చినుకులు పొంగే పొంగుమింద శారదు మంచినీళ్లు చల్లినట్టు రాలె. ఇంక చూస్కో నా తండ్రీ! వాడి కోడాలు ఆదరా బాదరా ఎండేస్తా ఉండే చెరుకు పిప్పిని ఉడ్డదోసేసి దాన్ని కప్పేదానికి ఎండు చెరుకాకును జవురుకుంటా వుండాది. కూలోళ్లు ముద్దలుపట్టి అరతావుండే బెల్లమింద పాత గోనెపట్టలు కప్పుతా ఉండారు. వెంకటరెడ్డిగూడా ఎగిరిపడి లేసె. ఆ మంచం మింద నాకోసరం పర్సిన పాత దుప్పిట్ని గుంజుకుండె. ఒక్క లగువులో పాయ్ దోనెలో ఆరతా ఉండే బెల్లం మింద కప్పె. వాళ్ల ఆర్బాటం చూస్తా వుంటే యీ మొకాలేనా? మట్టిమింద మమకారాన్ని చంపుకోబొయ్యేది. మడకల్ను యిసిరి మూలపారేసి కట్టుగా బయిటికి నడ్సేది? అనిపిస్తా ఉండాది.

ఒకే ఒక్క పూట. ఆడ నిలబడి వాడు పడే పాట్లు గెమనించినా.

కడుపు నిండి పొయ్యింది.

చాలుచాలని కొంప చేరుకుందామని బస్సెక్కినా.

బస్సులో కూలబణ్ణా. మణుసు మాత్రం వెంకటరెడ్డి చుట్టే చుట్టకలాడ్తా ఉండాది. ఎట్నో ఒకట్లా వచ్చి కొంపలో పడిపొయ్‌నా. దేశింగాని దేశానికి పొయ్యొచ్చినట్టుగా వొళ్లంతా వూనమైపొయ్యింది. పొణుకుణ్ణా నిద్దర పట్టి చస్తేగదా?

ఈ దేశింలో అందురు తినేవాళ్లే. పెట్టేది మాత్రం వాడొకడే. అయితే తిన్నె యింటికే వాసాలెంచినట్టుగా అందురూ చేరి వాణ్ణే తొక్కిపట్తా ఉండారు. అట్లయితే యిది ప్రెజా సామ్మెం ఎట్టవుతింది? చెలగాటం ఆడినంతసేపూ అది పిల్లే. తిరగబడ్తే అదే పులి. ఆ మాదిర్తో వాళ్లందురు వొగిటై మడకలు కట్టేది యిడ్సిపెట్టేస్తే? తిప్పాలనుకుణ్ణా స్పానర్ తిరిగ్తిందా? కదిలించాలనుకుణ్ణా కలం కదిల్తిందా? నోట్లో నాలికే లేనోడు వెంకటరెడ్డి. వాడే అంత మాట అన్నాడంటే? –

నా గుండె గెబీమనె. వెంకటరెడ్డి అనుకుణ్ణంత పని అములు జరిపిస్తే? మల్ల ఎట్టబ్బా? ఆలోచించేకుందికి కంటిమింద రెప్ప పడనంటా ఉండాది. అందుకే లేచినా. అడుగుమింద అడుగ్గా నాలుగ్గాళ్లమండపం కాడికి నడ్సినా.

నా కోసరం ఎదుర్సూస్తా ఉణ్ణెట్టుగా ఎదురుంగా ముత్తారెడ్డన్న!

''ఏమిరా అబ్బోడా! నిద్దరపట్లేదా?''

''ఎట్ల పట్టితిందన్నా?''

''ఒరే పిచ్చోడా! ఈ ప్రెజాసామ్మెంలో అందురు వొళ్లమర్సి నిద్దర పోతా ఉండాడు. నీకు నిద్దర పట్లేదంటే అరుసోద్దింగా ఉండాది. అసలు ప్రెజాసామ్మెం అంటే ఏందిరా! పదిమందీ సుకసంతోసాలతో ఉండడం. అట్ల ఉండాలంటే కడుపునిండా తిండి కంటినిండా నిద్ర కావాల్నా? ఇన్ని కోట్లమందికి సమకూర్సాలంటే అది సాద్దింగాని పని. అందుకే ప్రెబుత్వం శానా తీవ్రంగా ఆలోచించింది. కనీసం కంటికి నిద్రన్నా సమకూర్సాలని తీరుమానించుకుణ్ణింది. అద్దో అట్టాచూడు. ఆ రిక్సామిందనే వాలి వాడు గురకపెట్టా ఉండేది చూడు. వాడు తిన్నాడో? తిన్లేదో? మనకెందుకు? పొగులంతా వొళ్లు గుల్లచేసుకుణ్ణా యిప్పుడు కంటారా నిద్దరపోతా ఉండాడు.

ఏపాటో ఒక పాటుబడి నిద్దర బుచ్చేసినామా? వాడు మల్లా ఏమన్నా అడగమన్నా అడగతాడా? అదే మనకు కావాల్సింది.

అట్లని సాగినోణ్ణి కూడా సారాయి తాగమంటే తాగతాడా? పోనీ! బలంతం చేస్తాం అనుకో. అప్పుడు దేశింలో ప్రెజాసామ్మెం దెబ్బతిన్నెట్టేగదా లెక్క. అందుకే ఎవుడి సత్తాకు దగినట్లు వాడు అనబవిస్తా సంతోసంగా ఉండాలని సందుకొక సారాయి అంగిడే కాకుండా బజార్లల్లో బ్రాందీ అంగళ్లు ఈయరవకాడ గూడ తెర్సి పెట్టుకోనుంటే నిద్దర పట్లేదంటే ఎట్రా ఎర్రోడా?'' అనె.

ప్రెజాసామ్మెంలో ఉండే కిటుకు అర్తమాయ. నిద్దర ముంచుకో నొచ్చె. మా పిల్లలకోడి మణుసులో మెదిలె. కొంప చేరుకుందామని కాలుకదిలె. వెంకటరెడ్డి కత నాలుగ్గాళ్లమండపం కతల్లో ఒక కతగా మిగిలె! ●